క్లుప్తంగా

రూలర్ ఫుట్‌బాల్ పోటీల్లో ఏపీ జట్టు ప్రతిభ



ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టు సభ్యులతో డీఎస్‌డీఓ శ్రీనివాసరావు

కర్నూలు (టౌన్): ఈనెల 27 నుంచి 29 వరకు తెలంగాణ రాష్ట్రంలోని షాద్‌నగర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి రూలర్ ఫుట్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. మొదటి స్థానం తెలంగాణ జట్టు, మూడో స్థానంలో జార్ఖండ్ జట్లు నిలిచాయి. వెండి పతకం, మెడల్స్, ప్రశంసా పత్రాలు సాధించిన హిమబిందు, హన్సిక, రిషిర, మధుమిత (బాలికల విభాగం) ధీరజ్, చేతన్ (బాలుర విభాగం) క్రీడాకారులను సోమవారం స్పోర్ట్స్ అథారిటీకి చెందిన జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు తన చాంబర్‌లో అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి వేణుగోపాల్ పాల్గొన్నారు.

దోమల నివారణ చర్యలు చేపట్టాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు (టౌన్) : నగరంలో నెల రోజులుగా దోమల సమస్య తీవ్రంగా ఉందని, నివారణకు చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నిర్మల, జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, రాముడు డిమాండ్ చేశారు. ఈ అంశంపై సోమవారం స్థానిక నగరపాలక సంస్థ ఎదుట ఆ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మలేరియా విభాగం పనితీరు అధ్వానంగా ఉందన్నారు. హంద్రీ, కేసీ కెనాల్ ప్రాంతాల్లో చెత్తాచెదారాలు తొలగించాలని, ప్రతిరోజూ కాలనీల్లో ఫాగింగ్ కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజకు వినతిపత్ర అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అలివేలమ్మ, గురుశేఖర్, నగేష్, సుధాకర్, సాయిబాబా, విజయ్ పాల్గొన్నారు.

నేడు హుసేనాపురంలో పట్టాల పంపిణీ

ఓర్వకల్లు : మండలంలోని హుసేనాపురం గ్రామంలో నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా మంగళవారం పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు జీకే వెంగన్న సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చొరవతో గ్రామంలో రెండు విడతల్లో కలిపి అర్హులైన సుమారు 550 మందికి పట్టాలు మంజూరైనట్లు తెలిపారు. ఈ పట్టాలను ఉదయం 10.30 గంటలకు స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందన్నారు. మండల స్థాయి అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

చివరి దశకు చేరిన కుల గణన

కల్లూరు: అట్టడుగు వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన మండలంలో చివరి దశకు చేరిందని ఎంపీడీఓ జీవీ రమణమూర్తి తెలిపారు. సోమవారం ఆయన మండల పరిషత్ కార్యాలయం నుంచి కులగణన సర్వేను పర్యవేక్షించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ కల్లూరు గ్రామీణ ప్రాంతంలో 18 గ్రామ పంచాయతీలు, మజరాలతో కలిపి 25 గ్రామాలు ఉన్నాయన్నారు. మొత్తం 22,047 ఇళ్లు ఉండగా సోమవారం సాయంత్ర నాటికి 20,089 ఇళ్లలో కులగణన సర్వే పూర్తయినట్లు తెలిపారు. మొత్తంగా 91.12 శాతంతో జిల్లాలోనే మొదటి స్థానం సాధించినట్లు చెప్పారు. ప్రజలు కులగణన సర్వేకు సహకరిస్తుండటంతోనే సర్వేను సకాలంలో పూర్తి చేస్తున్నామన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

ఓర్వకల్లు: ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓర్వకల్లు ఎస్సీ కాలనీకి చెందిన గద్దల నవీన్ కుమార్(32) కోలుకోలేక సోమవారం మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రమైన ఓర్వకల్లు గ్రామం, ఎస్సీ కాలనీలో నివాసముంటున్న గద్దల నాగమణి, ఇమ్మానుయేలు దంపతుల కుమారుడు గద్దల నవీన్‌కుమార్ అలియాస్ క్లింటన్ కొన్నేళ్లుగా స్థానిక గ్రామ పంచాయతీ బోర్డులో ఎలక్ట్రీషియన్‌గా పని చేసేవాడు. అంతేకాక తనకున్న రెండు ఎకరాలతో పాటు, మరో రెండెకరాలను కౌలుకు తీసుకొని వర్షాధారం కింద పంటలు సాగు చేశాడు. కుటుంబ పోషణ, పెట్టుబడుల నిమిత్తం చేసిన అప్పులను తీర్చలేక మదనపడేవాడని స్థానికులు తెలిపారు. ఈ క్రమంలో మనస్తాపానికిగురై ఈ నెల 26న తన పొలంలోనే పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్సకోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు సంతానం.

కుష్టు తగ్గుతోంది!

కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. గతంలో ఎప్పుడూ లేని విధంగా కేసులను గుర్తించే కార్యక్రమం ముమ్మరంగా నిర్వహించడం, గుర్తించిన వారికి ఆరు నెలల పాటు ఎండీటీ చికిత్స అందిస్తుండటంతో వారు త్వరగా కోలుకుంటున్నారు. దీంతో గత ఐదేళ్ల నుంచి ఏటేటా కుష్టురోగుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. నేడు జాతీయ కుష్టు వ్యాధి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

- ఏటేటా తగ్గుతున్న కేసులు
- నిర్మూలన దిశగా ప్రభుత్వం చర్యలు
- ఈ యేడాది కొత్తగా 196 కేసుల నమోదు
- ఉచితంగా మందులు, ఉపకరణాల పంపిణీ చేస్తున్న వైనం
- నేడు జాతీయ కుష్టువ్యాధి వ్యతిరేక దినోత్సవం



కుష్టురోగులను గుర్తించే కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి ప్రజలను పరీక్షిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది



కర్నూలు(హాస్పిటల్): ఒకప్పుడు కుష్టు వ్యాధి గ్రస్తులను ఊరికి దూరంగా ఉంచేవారు.అంటరానివారిగా చూసేవారు. వారికి అవసరమైన తిండీ తిప్పలను సైతం వేరొకరితో అందించేవారు. అలాంటి స్థితి నుంచి వారందరూ ప్రజలందరితో కలిసిమెలసి జీవించేలా మహాత్మాగాంధీ కృషి చేశారు. కుష్టువ్యాధిగ్రస్తుల గాయాలను శుభ్రం చేయడం, వారితో కలిసి ఉండటం, తాకడం వంటి చర్యలను ఆయన అప్పట్లో నిర్వహించారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 30 అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో ఇటీవల ఆశ, ఏఎన్‌ఎంలు ఇంటింటికి తిరిగి కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు కొత్తగా 192 మందికి కుష్టు వ్యాధి ఉన్నట్లు నిర్ధారించారు. దీంతో పాత, కొత్త కేసులు కలిపి ఈ యేడాది 430 మంది చికిత్స పొందుతున్నారు. వ్యాధినిర్ధారణ అయిన తర్వాత బాధితున్ని పీహెచ్‌సీల్లోని మెడికల్ ఆఫీసర్ పరిశీలించి చికిత్స అందిస్తారు. కుష్టురోగులను చేర్చుకుని చికిత్స అందించేందుకు గాను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశారు. ఇందులో ఒక మెడికల్ ఆఫీసర్, ఒక ల్యాబ్‌టెక్నీషియన్, ఫిజియోథెరపిస్ట్, డీపీఎంఓలు పనిచేస్తారు. దీంతో పాటు నందికొట్కూరు రోడ్డులోని మరియా నిలయంలో అనాథలైన కుష్టువ్యాధిగ్రస్తులకు చికిత్స అందిస్తున్నారు.

కొత్త కేసుల గుర్తింపు ముమ్మరం

కొత్త కేసులను గుర్తించేందుకు వైద్యసిబ్బంది ఇంటింటి సర్వే చేస్తున్నారు. ఇందులో భాగంగా 2018-19లో 531 మందికి, 2019-20లో 506 మందికి, 2020-2021లో 136 మందికి, 2021-22లో 191 మందికి, 2022-23లో 188 మందికి, 2023లో డిసెంబర్ వరకు 192 మందికి కుష్టువ్యాధి సోకినట్లు అధికారులు నిర్ధారించారు. వ్యాధినిర్ధారణ, చికిత్సకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల కారణంగా ఎక్కువ సంఖ్యలో కేసులు నమోదు కావడం లేదు. వెలుగులోకి వచ్చిన కేసుల్లో ముందుగా పురుషులు, తర్వాత స్త్రీలు, అనంతరం చిన్నపిల్లల సంఖ్య అధికంగా ఉంటోంది. ఈ ఏడాది ఐదు గురికి రీ కన్‌స్ట్రక్షన్ సర్జరీలు నిర్వహించారు.

కుష్టు వ్యాధికి మందులు ఉచితం

జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో బహుళ ఔషధ చికిత్స(మల్టీడ్రగ్ థెరపి) ద్వారా కుష్టువ్యాధికి మందులు పూర్తిగా ఉచితంగా అందజేస్తున్నారు. వైద్యునిచే వ్యాధినిర్ధారణ అయిన తర్వాత మొదటి నెల వైద్యుని వద్ద, రెండో నెల నుంచి ఏఎన్‌ఎం ద్వారా ఇంటి వద్దే మందులు తీసుకోవచ్చు. వైద్యులు సూచించిన మేర నిర్ణీతకాలానికి మందులు క్రమం తప్పకుండా వాడాల్సి ఉంటుంది.

కుష్టు వ్యాధి లక్షణాలు

- ఈ వ్యాధి మైకో బ్యాక్టీరియా లెప్రి అను బ్యాక్టిరియా వల్ల వస్తుంది.
- రోగి తుమ్మడం, దగ్గడం వల్ల ఇతరులకు వ్యాప్తి చెందుతుంది.
- వ్యాధి లక్షణాలు కనిపించేందుకు మూడు నుంచి ఐదేళ్ల పడుతుంది.
- స్పర్శలేని మచ్చలు, ముఖం, చెవులు, ఛాతి, వీపుపై నొప్పిలేని బుడిపెలు, కాళ్లు, చేతుల్లో తిమ్మిర్లు, వాపులు ఉండటం, ముక్కుదూలం అణిగిపోయి గాలి ఆడకపోవడం, బొటనవేలు, చిటికెనవేలు, మణికట్టు పనిచేయకపోవడం, కాలి వేళ్లనేలకు రాసుకోవడం, పాదాలు, చేతులపై బొబ్బలు రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

నేటి నుంచి స్పర్శ కార్యక్రమాలు

జిల్లాలో ఈ నెల 30 నుంచి వచ్చే నెల 13వ తేదీ వరకు 15 రోజుల పాటు స్పర్శ కార్యక్రమం నిర్వహిస్తున్నాము. ఈ మేరకు అన్ని గ్రామ పంచాయతీల్లో, వార్డు సచివాలయాల్లో కుష్టువ్యాధిపై ఎంఎల్‌హెచ్‌పీ/ఏఎన్‌ఎం, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లు, ఉపాధ్యాయులచే గ్రామసభలు నిర్వహిస్తాము. ఈ సభల్లో కుష్టువ్యాధిపై అవగాహన, ఎండీటీ ఉచిత చికిత్స గురించి వివరిస్తారు. అలాగే కొత్త కేసులను గుర్తించడం, వారికి వెంటనే చికిత్స ప్రారంభించడం జరుగుతుంది. వ్యాధిలక్షణాలు కనిపించిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి చికిత్స తీసుకుంటే వ్యాధి తప్పక నయం అవుతుంది.

–డాక్టర్ ఎల్.భాస్కర్, అడిషనల్ డీఎంహెచ్‌ఓ (ఎయిడ్స్ అండ్ లెప్రసి), కర్నూలు

మార్కెట్‌లో ఈ-నామ్ సర్వర్‌కు అంతరాయం

కర్నూలు (అగ్రికల్చర్): వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ-నామ్ సర్వర్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సర్వర్ పనిచేయకపోవడంతో సోమవారం వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలు ఆలస్యంగా జరిగాయి. సాంకేతిక సమస్యలు పరిష్కారం కాకపోవడంతో వేరుశనగ మినహా మిగిలిన వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు మ్యానువల్‌గా నిర్వహించారు. మరో రెండు రోజులు ఈ-నామ్ సర్వర్‌లో అంతరాయం ఉండే అవకాశం ఉందని మార్కెట్ కమిటీ వర్గాలు తెలిపాయి. కాగా కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో కందుల ధర మరింత జోరు మీద ఉంది. గరిష్టంగా రూ.10,200 ధర లభించడం విశేషం. వాముకు రూ. 22,210, ఎండు మిర్చికి రూ.21,589, మినుముకు రూ.8,929 ప్రకారం ధర లభించాయి.

గోసంరక్షణ పథకానికి రూ.5 లక్షలు విరాళం

శ్రీశైలం: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న గో సంరక్షణ పథకానికి సికింద్రాబాదుకు చెందిన రాణి కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్, గల్లా గుండయ్య రూ.5 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు సోమవారం కుటుంబసభ్యులతో కలసి దేవస్థానం ప్రజాసంబంధాల అధికారి టి. శ్రీనివాసరావుకు చెక్కు అందజేయగా, వారు దాతలకు శ్రీస్వామి అమ్మవార్ల శేషవస్త్రాలు, అద్దప్రసాదాలను బహూకరించారు. అలాగే గో సంరక్షణశాలకు రూ.1,00,116లను చెన్నైకి చెందిన ఎల్.రమేష్ రెడ్డి విరాళంగా ఇచ్చారు.

అన్నదాన పథకానికి విరాళాలు

దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన రామకృష్ణ దంపతులు రూ.100,116, ఖమ్మం జిల్లాకు చెందిన శ్రీ పర్వతనేని వీవీఎస్ఎస్ శివరామకృష్ణ దంపతులు రూ.1,00,116, రంగారెడ్డి జిల్లా మారేడుపల్లికి చెందిన నందీశ్వరరెడ్డి 1,11,116లను సోమవారం విరాళాల కేంద్రంలో పర్యవేక్షకులు నాగరాజుకు అందజేశారు.

31న క్రైస్తవుల మహాధర్నా



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆంధ్రప్రదేశ్ క్రైస్తవ హక్కుల సమితి నాయకులు

కర్నూలు కల్చరల్: రాష్ట్రంలోని క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ క్రైస్తవ హక్కుల సమితి ఆధ్వర్యంలో ఈనెల 31వ తేదీ మహాధర్నా నిర్వహిస్తున్నట్లు సమితి కన్వీనర్ కె.హవిలన్ బాబు పేర్కొన్నారు. సోమవారం మౌర్యాఇన్ వద్ద మహాధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టసభల్లో మైనార్టీ క్రైస్తవులకు ప్రాధాన్యత కల్పించాలని, క్రైస్తవుల ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల శాతం పెంచాలని, మైనార్టీ క్రైస్తవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్లతో ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాజ్‌విహార్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా చేరుకొని అక్కడ మహా ధర్నా చేపడతామన్నారు. జిల్లాలోని క్రైస్తవులందరూ హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. కో కన్వీనర్లు జయకాంత్, విజయ్‌కుమార్, నాయకులు పులిజాకబ్, ఏవైఎస్ బాబు, గ్లోరి ప్రకాష్, సుందరరాజు, డేవిడ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు

- నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ



జగనన్నకు చెబుదాంలో వినతిపత్రాలు స్వీకరిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): అర్జీదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ హామీ ఇచ్చారు. సోమవారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో 'స్పందన','జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాలనీవాసులు సమస్యలపై కమిషనర్‌కు అర్జీలు అందజేశారు. వాటిని ఆయన పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో నగరపాలక అసిస్టెంట్ సిటీ ప్లానర్ శశిలత, ఎంహెచ్‌ఓ విశ్వేశ్వర రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

- తమ కాలనీలో డ్రైనేజీ, సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని ప్రేమనగర్‌కు చెందిన సుజాత, సంతోష్ నగర్‌కు చెందిన మాలా వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు.
- తాగునీరు, మురుగునీటి వ్యవస్థను ఏర్పాటు చేయాలని లక్ష్మీనగర్‌కు చెందిన వెంకటరమణ, తుంగభద్ర కాలనీకి చెందిన రవికాంత్ కోరారు.
- టిడ్కో గృహం కోసం డబ్బు చెల్లించినా గృహం కేటాయించలేదని మునీర్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు.
- తమకు స్థిరనివాసం లేదని టిడ్కో గృహం మంజూరు చేయాలని కొత్తపేటకు చెందిన ఉసేని విన్నవించారు.

5 నుంచి గిరిజన సాంస్కృతిక మహోత్సవాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్‌యూ వీసీ, విద్యార్థి సంఘాల నాయకులు

కర్నూలు కల్చరల్: ట్రైబల్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాజమండ్రి ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో ఫిబ్రవరి 5,6 తేదీల్లో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి గిరిజన సాంస్కృతిక మహోత్సవాల పోస్టర్లను సోమవారం రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గిరిజనుల చరిత్ర, సంస్కృతులు ప్రపంచానికే ఆదర్శమన్నారు. అలాంటి వాటిని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామరాజు, జిల్లా కార్యదర్శి వెంకటేష్, అంబేడ్కర్ స్టూడెంట్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మధుకృష్ణ, నాయకులు యువరాజు, తదితరులు పాల్గొన్నారు.

అల్లాబక్ష్ మృతి కళా రంగానికి తీరనిలోటు



అల్లాబక్ష్ భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న కళాకారులు

కర్నూలు కల్చరల్: ప్రముఖ రంగస్థల కళాకారుడు ఎన్టీఆర్ అవార్డు గ్రహీత లొద్దిపల్లె అల్లాబక్ష్ (93) అనారోగ్యంతో సోమవారం మృతి చెందడంపై కళాకారులు సంతాపం తెలిపారు. ఆయన మృతి కళారంగానికి తీరనిలోటని చెప్పారు. అల్లాబక్ష్ ఐదు దశాబ్దాలుగా కళా రంగానికి విశేష కృషి చేశారు. శ్రీకృష్ణుడు, హరిశ్చంద్ర, బిల్వమంగళుడుగా పాత్రలు వేసి ప్రేక్షకులను మెప్పించారు. ఈ నేపథ్యంలో ఆయన మృతికి టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మహమ్మద్‌మియ్యా, కర్నూలు కళాకళారుల సంక్షేమ సంఘం హనుమంతరాయ చౌదరి, సీనియర్ కళాకారులు హెచ్. చంద్రన్న తదితరులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కోశాధికారి లక్ష్మీకాంతరావు, సభ్యులు సంగా ఆంజనేయులు, ఇనాయతుల్లా, బాలవెంకటేశ్వర్లు, గాండ్ల లక్ష్మన్న, రాజారత్నం నివాళి అర్పించిన వారిలో ఉన్నారు.

వాలీబాల్ విజేత శరీన్‌నగర్



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

ఓర్వకల్లు: ఆడుదాం..ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా మండల కేంద్రమైన ఓర్వకల్లు జెడ్పీహైస్కూల్ మైదానంలో ఈ నెల 23 నుంచి ప్రారంభమైన నియోజకవర్గ స్థాయి పోటీలు సోమవారం ముగిశాయి. వాలీబాల్ పురుషుల విభాగంలో కల్లూరు మండలం, శరీన్‌నగర్ జట్టు ప్రథమ విజేతగా నిలిచినట్లు ఫిజికల్ డైరెక్టర్ హరిప్రసాద్ తెలిపారు. రెండో స్థానంలో ఉల్లిందకొండ, మూడో స్థానంలో నన్నూరు-2 సచివాలయాల జట్లు నిలిచాయన్నారు. బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో కర్నూలు జట్టు ప్రథమ స్థానం, పాణ్యం-3 జట్టు ద్వితీయ స్థానం, లక్ష్మీపురం జట్టు మూడో స్థానంలో నిలిచినట్లు వెల్లడించారు. మహిళల విభాగంలో ఎఫ్‌సీఐ కాలనీ జట్టు ప్రథమ స్థానం, కన్నమడకల జట్టు రెండో స్థానం, వీకర్‌సెక్షన్ కాలనీ జట్టు మూడోస్థానం సాధించాయని చెప్పారు. విజేతలైన జట్లకు ఎంఈఓ ఓంకార్‌యాదవ్ బహుమతులను ప్రదానం చేశారు.

డ్రైవర్లు తరచూ కంటి పరీక్షలు చేయించుకోవాలి



డ్రైవర్లనుద్దేశించి మాట్లాడుతున్న ఎంవీఐ మనోహర్‌రెడ్డి

కర్నూలు: డ్రైవర్లు తరచూ కంటి పరీక్షలు చేయించుకోవాలని మోటార్ వాహన తనిఖీల అధికారి డి.మనోహర్‌రెడ్డి సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవంలో భాగంగా సోమవారం కర్నూలు శివారులోని డోన్ జాతీయ రహదారి పక్కన మిస్టర్ ఇడ్లీ ఎదురుగా ఉన్న లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో లారీ, ఆటో డ్రైవర్లకు కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సుశీల నేత్రాలయ వైద్యుడు డాక్టర్ నాగార్జునతో పాటు రోడ్డు సేఫ్టీ మెడికల్ ఆఫీసర్ జెషాన్ అహ్మద్ పాల్గొని డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి వారికి ఉన్న లోపాలను గుర్తించి తగిన సూచనలు, సలహాలతో పాటు మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంవీఐ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి డ్రైవర్ ప్రాణం విలువ తెలుసుకొని రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. రాత్రివేళల్లో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతుంటాయని, భారీ వాహనాల డ్రైవర్లు ఫోకస్ లైట్ల వాడకం వల్ల ఎదురుగా వచ్చే వాహనం డ్రైవర్లకు కనిపించక ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ఫోకస్ లైట్లకు బదులు మామూలు లైట్లు ఉపయోగించాలని భారీ వాహన డ్రైవర్లకు సూచించారు. దూర ప్రయాణం చేసేవారు అలసిపోయి రోడ్డు పక్కనే వాహనాలు నిలపడం వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్డు సైడు వాహనాలు పార్కు చేసేటప్పుడు రోడ్ సేఫ్టీ మెజర్స్ పాటించాలన్నారు. వాహనాలు ఓవర్‌టేక్ చేసేటప్పుడు కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోడ్డు భద్రత నిబంధనల గురించి ముద్రించిన కరపత్రాలను ఈ సందర్భంగా డ్రైవర్లకు పంపిణీ చేశారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తామంటూ వారి చేత ప్రతిజ్ఞ కూడా చేయించారు.

ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన



ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సుధాకర్

కల్లూరు: పరిశుభ్రమైన నీరు తాగాలని ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్ సూచించారు. సోమ వారం కల్లూరు మండలం పెద్దటేకూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఫ్లోరోసిస్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ తాగడానికి, వంటలు చేసుకోవడానికి నీరు ముఖ్యమైనదన్నారు. నీటిలో మంచి సూక్ష్మపోషకాలు ఉంటాయన్నారు. ఫ్లోరోసిస్ వ్యాధి వలన దంతాల మీద అడ్డంగా పసుపు రంగు గీతలు ఏర్పడుతాయని, దంతాలు గోధుమ రంగులో మారి, చిగుళ్ల మధ్య నల్లగా ఉండి, చాక్ పీసు రంగులోకి మారుతాయని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

ప్రభాకర్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీతో సంబంధం లేదు



మాట్లాడుతున్న మార్కెట్ యార్డు డైరెక్టర్ రామకృష్ణారెడ్డి

కల్లూరు: పుసులూరు గ్రామానికి చెందిన ప్రభాకర్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీతో ఎలాంటి సంబంధం లేదని కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు డైరెక్టర్ (పుసులూరు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు) రామకృష్ణారెడ్డి తెలిపారు. పత్తికొండలో జరిగిన టీడీపీ సభలో ప్రభాకర్‌రెడ్డిని టీడీపీలో చేర్చుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. సోమవారం సాయంత్రం కల్లూరు అర్బన్ 26వ వార్డు న్యూ కృష్ణానగర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభాకర్‌రెడ్డి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అనుచరుడని ఎల్లో మీడియా, టీడీపీ నాయకులు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. పాణ్యం నియోజకవర్గం డీలిమిటేషన్ అయ్యాక 2009 నుంచి ఇప్పటి వరకు ఎమ్మెల్యే కాటసాని తరుపున ఆయన ఎన్నడూ ఎన్నికల్లో ప్రచారం చేయలేదన్నారు. అతను పార్టీలో రావాలని ప్రయత్నిస్తే.. సొంత ప్రయోజనాలు ఆశించే వ్యక్తులకు పార్టీలో చోటు లేదని చేర్చుకోలేదన్నారు. టీడీపీ నాయకులు ఆ పార్టీకి చెందిన వ్యక్తినే మళ్లీ చేర్చుకొని ప్రచారం చేస్తున్నారన్నారు. ఆయన పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారుల వైపు నిలిచాడని గుర్తుచేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దండు లక్ష్మీకాంతరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సత్యంరెడ్డి, మురళీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిపై అపోహలొద్దు

కర్నూలు (టౌన్) : సరఫరా చేస్తున్న మంచినీటిపై ఎలాంటి అపోహలు పడొద్దని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మునగాలపాడు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో రెండు రోజుల క్రితం ఒక యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల సహకారంతో ఆ యువకుడి మృత దేహాన్ని బయటకు తీసి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. ప్రస్తుతం 1200 డయా పైపులైన్‌ను సూపర్ క్లోరినేషన్ ద్వారా శుభ్రపరచడమే గాక నీటి నాణ్యతను ప్రయోగశాలలో పరిశీలించి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

4న కలశయాత్ర

కర్నూలు కల్చరల్: వాసవీ దీక్షా సమితి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 4వ తేదీన కలశ యాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆ రోజు ఉదయం 8 గంటలకు ఓల్డ్‌సిటీలోని రాంబొట్ల దేవాలయం నుంచి చిన్న అమ్మవారి శాల వరకు యాత్ర జరుగుతుందన్నారు. అనంతరం చిన్న అమ్మవారి శాలలో వాసవి మాతకు అభిషేకం నిర్వహిస్తామన్నారు. 5వ తేదీ ఉదయం 10 గంటలకు కలశ స్థాపన, 12 గంటలకు పూర్ణాహుతి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. యాత్రలో పాల్గొనే కన్యలు తమ పేర్లను ఫిబ్రవరి 2వ తేదీలోగా చిన్న అమ్మవారి శాలలో నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్రాథమిక హక్కులను వినియోగించుకోవాలి

పాణ్యం: చెంచులకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను వినియోగించుకొని న్యాయం పొందాలని కర్నూలు సీఐడీ సీఐ శ్రీధర్ అన్నారు. సోమవారం పాణ్యంలోని చెంచుకాలనీలోని ఆశ్రమ పాఠశాలలో చెంచులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ చెంచులు న్యాయం పొందేందుకు న్యాయస్థానాలు, పోలీసు స్టేషన్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. అంతేకాక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు అనేక రకాల రాయితీలు కల్పిస్తున్నాయని, వాటిని ఉపయోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. గిరిజనులు తమ పిల్లలకు ఉన్నత చదువులు చదివించాలన్నారు.అనంతరం చెంచుల జీవన విధానాలు అడిగి తెలుసుకున్నారు. నాటుసారా తయారీ, ఇతర చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. రెవెన్యూశాఖ కు సంబంధించి గిరిజనులకు అందించే సేవలపై డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి అవగాహన కల్పించారు.